క్లుప్తంగా

ఏఐపై వర్క్‌షాప్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఐఐసీ, ఐక్యూఏసీ, అనుదీప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూగుల్ ఏఐపై రెండు రోజుల వర్క్‌షాపు బుధవారం ప్రారంభమైంది. ప్రిన్సిపల్ నారాయణమ్మ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాలా శక్తివంతమైందని తెలిపారు. విద్యార్థినులు ఏఐపై పట్టు సాధించాలనే ఉద్దేశంతో వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సుబ్రమణ్యం రెడ్డి, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ భద్రమణి, డాక్టర్ విద్యులత పాల్గొన్నారు. ఈ క్రమంలోనే పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో తల్లిపాల దినోత్సవం నిర్వహించారు.

బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్



సతీష్‌కు నియామకపత్రం అందిస్తున్న శీనప్ప

తిరుపతి కల్చరల్ : భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జిల్లా అధ్యక్షుడిగా ఆకుల సతీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.బుధవారం గాంధీరోడ్డులోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శీనప్ప జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన ఆకుల సతీష్‌కుమార్‌కు నియామక పత్రం అందించారు. అనంతరం జిల్లా కమిటీని ప్రకటించారు. బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా జయప్రకాష్, శివశంకరయ్య, వెంకట్‌రాజు, కార్యదర్శిగా చంద్రకాంత్, సంయుక్త కార్యదర్శులుగా వెంకటాద్రి యాదవ్,కుమార్ ,సంస్థాగత కార్యదర్శిగా స్వర్ణలత, కోశాధికారిగా రవికుమార్, కార్యాలయ కార్యదర్శిగా పి.ఉమేష్ నియమితులయ్యారు.

9 నుంచి 'అప్సా' వార్షిక కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న డాక్టర్ ప్రేమానంద్

తిరుపతి కల్చరల్ : అసోసియేషన్ ఆఫ్ పల్మనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర (అప్సా) వార్షిక కాన్ఫరెన్స్‌ను ఈనెల 9,10 తేదీల్లో మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రేమానంద్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పల్మనాలజీలో పరిశోధనలను పెంపొందించేందుకు ఎంపిక చేసిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే శుక్రవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ భరత్ పాల్గొన్నారు.

అద్వైత వేదాంతంపై చర్చాగోష్టి



జ్యోతి ప్రజ్వలనలో సాధుశ్రీ భద్రేశదాస స్వామి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో అద్వైత వేదాంత శాస్త్రంలోని అంశాలపై విద్యార్థులతో చర్చా గోష్టి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సాధుశ్రీ భద్రేశదాస స్వామి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో చర్చను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భగవత్పాదాచార్యుల వాక్యార్థ సభలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబరచాలన్నారు. అద్వైత వేదాంతంలోని శాస్త్రీయాలపై విశ్లేషణాత్మక చర్చతో విజ్ఞానం పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. విభాగాధ్యక్షులు గణపతి భట్, దినేష్ పా, అధ్యాపకులు సతీశాచార్య, నాగరాజ భట్, మనోజ్ షిండే అంగద్, శ్రీహరి శివరామ్ పాల్గొన్నారు

ఆక్రమణపై ఆగ్రహం



నిరసన తెలుపుతున్న ఏఐడీఎస్ఓ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటానికి గుర్తుగా బ్రిటీష్ సైనికాధికారుల స్కాట్ కోవర్ట్ హైటర్ సమాధుల స్థలాన్ని కొందరు ఆక్రమించడంపై ఏఐడీఎస్ఓ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఏఐడీఎస్ఓ నేతలు తేజశ్రీ, జి.ఉన్నతి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి : కేసు నమోదు

తిరుపతి క్రైమ్ : విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పై దాడి చేసి పరారైన వ్యక్తులపై కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. జూలై 30వ తేదీ అర్ధరాత్రి లక్ష్మీపురం సర్కిల్ వద్ద గొడవ జరుగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఘటనాస్థలానికి వెళ్లిన ఏఎస్ఐ ఈశ్వరయ్యకు మద్యం మత్తులో గొడవ పడుతున్న ఫయాజ్, మనోజ్ కనిపించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వ్యాన్‌లో తరలిస్తుండగా పారిపోయేందుకు యత్నించారు. అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌పై రాయితో దాడి చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దామినేడులోని ఇందిరమ్మ గృహాలు



పేదల ఆవాసంలో..
నేరగాళ్ల నివాసం!

నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. తిరుపతి నగరానికి సమీపంలోని దామినేడు వద్ద ఇందిరమ్మ గృహాలను అపార్ట్‌మెంట్‌లుగా నిర్మించారు. వేలాది మందికి గూడు ఏర్పాటు చేశారు. అయితే అక్కడి పేదల ఆవాసాలనే పలువురు నేరగాళ్లు నివాసాలుగా మార్చుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం తరలివచ్చి గుట్టుచప్పుడు కాకుండా పాగా వేశారు. యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నారు. మహిళలపై లైంగికదాడులు.. గంజాయి విక్రయాలు.. నకిలీ మద్యం తయారీతో ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేసేస్తున్నారు.

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా దామినేడులోని ఇందిరమ్మ ఇళ్లు
- తలదాచుకుంటున్న రౌడీషీటర్లు.. స్మగ్లర్లు
- యథేచ్ఛగా గంజాయి విక్రయాలు
- కట్టుదిట్టంగా నిఘా పెట్టాలంటున్న స్థానికులు

చంద్రగిరి : ఆధ్యాత్మిక క్షేత్రం తిరునగరికి సమీపంలో.. సిరులతల్లి కొలువైన తిరుచానూరుకు అత్యంత సమీపంలో.. జిల్లా ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించే కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో దామినేడులోని ఇందిరమ్మ గృహ సముదాయాలు ఉన్నాయి. వేలాది కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. అధిక భాగం తిరుమల, తిరుపతి, రేణిగుంట పరిసర ప్రాంతాల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాధారణ మధ్యతరగతికి చెందిన వారే ఎక్కువ మంది నివసిస్తున్నారు. అలాంటి ప్రదేశమే నేడు అసాంఘిక శక్తులకు ఆవాసంగా మారిపోయింది.

పెట్రేగిపోతున్న గంజాయి బ్యాచ్

గత ఏడాదిగా ఇందిరమ్మ గృహ సముదాయాల్లో పూర్తిగా శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన గంజాయి స్మగ్లర్లు ఇక్కడ తిష్టవేసినట్లుగా తెలుస్తోంది. స్థానిక యువతకు గంజాయిని విక్రయిస్తూ, మత్తుకు బానిసలుగా మార్చుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా యువత పెడదోవపట్టి అసాంఘిక శక్తులుగా మారుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఈగల్ టీమ్ డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, మత్తు ఇంజెక్షన్లను వేసుకునే యువకులను గుర్తించి స్టేషన్‌కు తరలించారు.అదే విధంగా మంగళవారం తమిళనాడు చెందిన రౌడీషీటర్ల నుంచి రెండు కిలోల గంజాయిని సైతం స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపించారు.

కరువైన రక్షణ

ఇందిరమ్మ ఇళ్లలో నివసించే గృహిణులకు రక్షణ కరువైందని స్థానికులు వాపోతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కరుడుగట్టిన నేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా పాగా వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి, మత్తు పదార్థాలను సేవించి గృహిణులపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. మంగళవారం ఈ మేరకే ఓ నూతన వధువుపై తమిళనాడుకు చెందిన ఓ నేరగాడు లైంగికదాడికి పాల్పడడం సంచలనంగా మారింది. కత్తిని గొంతుపై ఉంచి, అరిస్తే చంపేస్తానంటూ బెదిరించి మరీ ఆ నవ వధువు జీవితాన్ని ఛిద్రం చేశాడు. మూడు నెలలుగా ఈ ప్రాంతంలో పలువురు రౌడీషీటర్లు, అంతర్రాష్ట్ర నేరస్తులు తిష్ట వేసి స్థానిక పోలీసులు, ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మద్యం తయారీ ముఠాను పట్టుకున్న అధికారులు (ఫైల్)



అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం, లేబుళ్లు, స్టిక్కర్లు (ఫైల్)

> **నిరంతర పోలీసింగ్**
>
> దామినేడు ఇందిరమ్మ కాలనీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. హైవేతోపాటు కలెక్టరేట్‌కు దగ్గర్లో ఉండడంతో నిరంతరం పోలీసింగ్ ఉంటోంది. స్థానికులు కూడా మాకు సహకరించాలి. సరైన ఐడెంటిటీ తీసుకోకుండా, ఎవరికి పడితే వారికి ఇంటిని అద్దెకు ఇవ్వడం మంచిది కాదు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. ఈ క్రమంలోనే విజిబుల్ పోలీసింగ్ వ్యవస్థ సైతం అందుబాటులో ఉంది.
>
> – ప్రసాద్, డీఎస్పీ, చంద్రగిరి

ప్రత్యేక పికెటింగ్ అవసరం

దామినేడు ఇందిరమ్మ గృహాల వద్ద పోలీసు ప్రత్యేక పికెటింగ్ అవసరమని స్థానికులు కోరుతున్నారు. ఈ ఏడాది జనవరి ఆఖరులో భారీగా నకిలీ మద్యం తయారీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఇప్పటికీ బెల్టు దుకాణాల నిర్వహణ, గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్థానికులు వెల్లడిస్తున్నారు. ప్రశ్నిస్తే మారణాయుధాలతో దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ గృహాల వద్ద భద్రత పెంచడంతోపాటు, కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

- ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఉదయం 10 గంటలకు డాక్టర్ స్వామినాథన్ శత జయంతి వేడుకలు.
- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తారకరామ స్టేడియంలో ఉదయం 9 నుంచి జిల్లా స్థాయి స్పోర్ట్ మీట్‌లో భాగంగా ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీలు.
- అన్నమయ్య సర్కిల్ సమీపంలో త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామీజీ చేతులమీదుగా ఉదయం 10 గంటలకు కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ షోరూమ్ ప్రారంభం.
- యోగిమల్లవరంలోని కామక్యాంబ సమేత పరమేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, అంకురార్పణతో లక్ష బిల్వార్చన ప్రారంభం.
- వార్–2 చిత్రం విడుదలను పురస్కరించుకుని జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు నగరంలో బైక్ ర్యాలీ.

మోహిత్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం



మోహిత్‌రెడ్డిని సన్మానిస్తున్న సుబ్రమణ్యం

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీలో జిల్లాస్థాయి పదవికి అవకాశం కల్పించినందుకు పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి బీసీ విభాగం జిల్లా కార్యదర్శి బత్తల సుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఈ మేరకు తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా సత్కరించారు. నేతలు కిరణ్, ప్రశాంత్, శ్రీకాంత్, బత్తల బుజ్జిబాబు పాల్గొన్నారు.

పశు యజమానులపై ఫిర్యాదు

చంద్రగిరి : పంట పొలాలను పశువులు నాశనం చేస్తున్నాయని, వాటి యజమానులైన మహేష్, కుటుంబసభ్యులను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతు యారాశి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఆరోపించారు. బుధవారం ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'సదరం' కోసం ఆవేదన



కలెక్టరేట్ వద్ద భార్యతో నరసింహులు

తిరుపతి అర్బన్ : సదరం సర్టిఫికెట్ కోసం ఏడాదిగా రుయా ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వి.నరసింహులు అనే వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ తిరుపతి యాదవ కాలనీలో నివసిస్తున్నామని, ఏడాది క్రితం పక్షవాతం వచ్చి ఓ కాలు, చెయ్యి పడిపోయాయని వెల్లడించారు. నిరుపేదైన తనకు దివ్యాంగ పింఛన్ వస్తే ఆదరవుగా ఉంటుందని తెలిపారు. అయితే రుయా ఆస్పత్రి చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఎవరూ స్పందించడం లేదని వాపోయారు. చివరకు కలెక్టరేట్ చుట్టూ కూడా రెండు వారాలుగా తిరుగుతున్నానని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

టీటీడీ ఐటీ ఇన్‌చార్జి జీఎంగా ఫణికుమార్

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : టీటీడీ ఐటీ విభాగం ఇన్‌చార్జి జీఎంగా ఫణికుమార్ నాయుడు నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు.

మహిళా వర్సిటీలో ఏసీఈ సమావేశం



సదస్సును ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సరిత

తిరుపతి రూరల్ : పద్మావతీ మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఏసీఈ (అసోసియేషన్ ఆఫ్ ఇంజినీర్స్) సమావేశం నిర్వహించారు. వర్సిటీలోని ధృతి మల్టీ పర్పస్ హాలులో జరిగిన ఈ సమావేశానికి కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ అధ్యాపకులు, పలువురు విద్యార్థులు హాజరయ్యారు.ప్రొఫెసర్ ఎం.హుమేరాఖానం మాట్లాడుతూ ఇంజినీరింగ్ రంగంలో తాజా పరిస్థితులు, సాంకేతిక విప్లవం, ఆవశ్యకతలను సమగ్రంగా వివరించారు. ప్రిన్సిపల్ మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రొఫెసర్ వి.సరిత అసోసియేషన్ ఆఫ్ ఇంజినీర్స్ వార్షిక నివేదికను సమర్పించారు. ఏసీఈ కో–ఆర్డినేటర్లు జి.రాధిక, డాక్టర్ కె.లావణ్యం, డాక్టర్ పి.నీలిమ, విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర, సుశ్రుత్, హారిక పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలోని అన్నారావు కూడలి, కేటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ మౌర్య బుధవారం పరిశీలించారు. పలు చోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు, మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలల్లా భవన నిర్మాణ వ్యర్థాలు పడేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యర్థాలు ఉంటే వెంటనే తూకివాకం ప్లాంట్‌కు తరలించాలని స్పష్టం చేశారు. చెత్తకుప్పలను వెంటనే తొలగించాలని సూచించారు. రోడ్లపై గుంతలను పూడ్చించాలని ఆదేశించారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలని స్పష్టం చేశారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, డీఈలు మధు, వెంకట ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

ఆర్య వర్క్‌పై మూడు నెలల శిక్షణ



ఆర్య వర్క్ నేర్చుకుంటున్న మహిళలు

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం మరియు జన్ శిక్షణ సంస్థాన్ (జెఎస్ఎస్), రాస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆర్య వర్క్‌పై మూడు నెలల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి తెలిపారు. రేణిగుంట మండలం ఎలమండ్యం గ్రామంలో ఆర్యవర్క్ నేర్చుకునే వారికి అవసరమైనటువంటి సలహాలు ఇస్తూ, ఫ్రేములపైన, మగ్గంపైన బట్టలను ఎలా సెట్ చేసి కుట్టాలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవలసిందిగా తెలిపారు. ఆర్య వర్క్ వేయడానికి కావలసినటువంటి ఫ్రేములను దారాలు, సూదులు తదితర మెటీరియల్స్‌ని ఉచితంగా మహిళలకు అందజేశారు. శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ఆర్య వర్క్‌పై పట్టుకలిగిన రమ మహిళలకు శిక్షణ అందించారు. ఈ శిక్షణా కార్యక్రమం నవంబరు 14వ తేదీ వరకు ఉంటుందన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్ : వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. నగరంలో వినాయక విగ్రహాలు ఊరేగింపుగా వెళ్లే ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఎస్వీ నగర్, పద్మావతి నగర్, రాళ్లపల్లి సర్కిల్, ఎంఆర్‌పల్లి, పూర్ణకుంభం, లీలామహల్, వినాయక సాగర్ వరకు తనిఖీ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. గణపతి ప్రతిమలను పోలీసుల అనుమతితోనే మండపాల్లో ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. అడిషనల్ ఎస్పీ రవి మనోహర చారి పాల్గొన్నారు.

అన్న ప్రసాదం ట్రస్ట్‌కు విరాళం



అదనపు ఈఓకు చెక్ అందిస్తున్న దాత

తిరుమల : తిరుమల శ్రీవారి అన్న ప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాదుకు చెందిన లీలా కుమార్ వెంకట్ నారాయణ కాజా అనే భక్తుడు రూ.10లక్షలు విరాళం ఇచ్చారు. బుధవారం ఈ మేరకు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి చెక్కును అందజేశారు.

ఎన్‌ఎస్‌యూలో కొత్త క్లాస్ రూములు



క్లాస్ రూములను ప్రారంభిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో బుధవారం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి నూతన క్లాస్‌రూములను ప్రారంభించారు. బీఈడీ, ఎంఈడీ కోర్సులలో ప్రవేశాల పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. డీన్‌లు ప్రొఫెసర్ దక్షిణమూర్తి శర్మ, రజనీకాంత్ శుక్లా, కాదాంబిని పాల్గొన్నారు

టీటీడీ చైర్మన్ రాజీనామాకు డిమాండ్



నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

తిరుపతి సిటీ : అహకారంతో, నిర్లక్ష్యంగా, కమ్యూనిస్టులను హేళన చేస్తూ మాట్లాడిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో పద్మావతి జూనియర్ కళాశాల ఎదుట నిరసనకు దిగారు. అక్కడికి విచ్చేసిన టీటీడీ చైర్మన్‌కు సమస్యలను వివరిస్తుండగా అసహనం వ్యక్తం చేయడంపై మండిపడ్డారు. ఇలా పోరాటాలు చేసుకుంటూ పోతే కమ్యూనిస్టులు ఎప్పటికీ అధికారంలోకి రాలేరని హేళన చేయడం దారుణమన్నారు. ప్రజా సమస్యలు వినలేని స్థితిలో ఉన్న బీఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ పదవికి అనర్హుడని స్పష్టం చేశారు. టీటీడీ అనుబంధ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందిన ప్రతి విద్యార్థికీ హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నేతలు రాధాకృష్ణ, ఎస్.శివ, కేవై రాజా, ఆర్.బలరాం, మహేంద్ర, గోవింద్ స్వామి, రామచంద్రయ్య, వెంకటేష్, ప్రమీలమ్మ, పార్వతి, మునీశ్వర్, విక్రమ్, పూర్ణ, హరికృష్ణ, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినుల హాస్టల్ వసతి పెంపునకు ఆదేశం



హాస్టల్ గదులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్, అధికారులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సీటు పొందిన విద్యార్థినులకు హాస్టల్ వసతి పెంచుతూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు. బుధవారం ఆయన ఎస్వీడబ్ల్యూ కళాశాలను జేఈఓ వీరబ్రహ్మంతో కలసి పరిశీలించి ప్రిన్సిపల్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో అత్యవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కళాశాలలో విద్యార్థినుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, విద్యార్థినులు ప్రాథమిక అవసరాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కళాశాలలోని సమస్యలను టీటీడీ జేఈఓ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకువచ్చారని, సమస్యలపై నివేదిక తయారు చేయాలని సూచించామన్నారు. విద్యార్థినులు చదువుకునేందుకు కళాశాల పరిసరాలు బాగున్నాయని, ఉత్తీర్ణత శాతం ఆశించిన స్థాయికి మించి ఉందని అభినందించారు. ప్రధానంగా విద్యార్థుల హాస్టల్ సామర్థ్యాన్ని, వసతి సౌకర్యాన్ని పెంచాలని, వైద్య సౌకర్యాలు, వేడి నీటి కోసం సోలార్ వాటర్ హీటర్స్, ఈ- లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటు, హాస్టల్‌లో మరమ్మతులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌకర్యం తదితర అంశాలపై అధికారులు నివేదిక తయారు చేసి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి కళాశాల పరిసరాలు, వంట గది, హాస్టల్ గదులను తనిఖీ చేసి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టీటీడీ డీఈఓ వెంకట సునీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి, ఎస్ఈ మనోహరం పాల్గొన్నారు.

మత్తు బానిసలకు కౌన్సెలింగ్



చిన్నగోవిందు, సీఐ

తిరుపతి రూరల్ : మత్తుకు బానిసలుగా మారిన యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి మార్పునకు కృషి చేస్తామని సీఐ చిన్నగోవిందు తెలిపారు. బుధవారం ఈమేరకు బైరాగిపట్టెడ, వాణీనగర్‌లో మత్తు ఇంజెక్షన్లు వేసుకుంటూ పట్టుబడిన ఆరుగురు యువకులతో ఆయన మాట్లాడారు. మత్తు ఇంజెక్షన్లు ఎవరు ఇచ్చారు.. ఎక్కడ నుంచి వచ్చాయి అనే కోణంలో విచారించి కేసు నమోదు చేశారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. ఎవరైనా మత్తుకు అలవాటు పడిన వారు కనిపిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు. 8099999977 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. , సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

తిరుమల: మొదటి ఘాట్ రోడ్‌లో ద్విచక్ర వాహనదారుడికి త్రుటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కడపకు చెందిన ధనుంజయ రెడ్డి అనే వ్యక్తి శ్రీవారిని దర్శించుకుని, తన ద్విచక్రవాహనంపై తిరుగుప్రయాణమయ్యాడు. మొదటి ఘాట్ 27 మలుపు వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయాడు. ఈ క్రమంలో వాహన అదుపుతప్పి బస్సు కింద‌కు దూరింది. అదృష్టవశాత్తు ధనుంజయ రెడ్డి పక్కకు పడిపోవడంతో ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డాడు.

గుంతలో పడి ఆవు మృతి

చంద్రగిరి : మండలంలోని నాగపట్ల చెరువులో ఉపాధి పనుల కింద తీసిన గుంతలో పడి ఓ ఆవు మంగళవారం రాత్రి మృతి చెందింది. ఏ.రంగంపేటకు చెందిన పాడి రైతు పుత్తూరు మునికృష్ణయ్య అలియాస్ పెద్దబ్బ బుధవారం ఉదయం ఆవు కళేబరం చూసి ఆవేదన చెందాడు. సుమారు రూ.50వేల విలువైన ఆవు మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

సైలెన్సర్ మారిస్తే చర్యలు

తిరుపతి క్రైమ్ : ద్విచక్ర వాహనదారులకు కంపెనీ ఇచ్చే సైలెన్సర్లను మారిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ రామకృష్ణ చారి హెచ్చరించారు. బుధవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో మెకానిక్‌లతో సమావేశం నిర్వహించారు. మెకానిక్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నగరంలో అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో దృష్టి సారించామన్నారు. ఇలా సైలెన్సర్ మార్చాలని ఎవరైనా కోరితే మెకానిక్‌లు నిరాకరించాలని స్పష్టం చేశారు. ఆదేశాలను అతిక్రమించి సైలెన్సర్ మారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నలుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి నగరంలో నిర్లక్ష్యంగా ఆటోలు నడుపుతున్న కేసులో నలుగురికి రెండు రోజులు చొప్పున జైలు శిక్ష, రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు .అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.